క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం



నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అలేఖ్య

గంట్యాడ: మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామంలో శంకరఫౌండేషన్ ఆధ్వ ర్యంలో బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ కొంచాడ సన్యాసినాయుడు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఆప్తాలమిక్ అలేఖ్య 62 మందికి కంటి పరీక్షలు చేసి 32 మందిని నేత్రశస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాత

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మండల పైడితల్లి రూ.63 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు దాత పైడితల్లి బుధ వారం నగదు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పైడి తల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే



గంట్యాడలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంతో పాటు మండల కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వేను భవిత కేంద్రం ఐఈఆర్టీలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) ఎన్.ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. డీఈఓ వెంట ఎంఈఓ విజయగౌరి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీఓ రామారావు

గజపతినగరం రూరల్: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలోని రామచెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ రామారావు బుధవారం పరిశీలించారు. మస్తర్ల సీట్లను తనిఖీ చేసిన అనంతరం ఆయన వేతనదారులతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందన్నారు. జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నామని, మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ పనులు జరుగుతున్నాయని చెప్పారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



పురిటిపెంట న్యూకాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులతో పాటు అన్ని సదుపాయాలు ఉన్నాయని, పదోతరగతి ఉత్తీ ర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఆ కళాశాల కామర్స్ లెక్చరర్ రాజేష్ కోరారు. మండల కేంద్రం గజపతినగరంతో పాటు పురిటిపెంట గ్రామంలోని న్యూకాలనీలో అధ్యాపకులు అడ్మిషన్‌ల క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రాజేష్, సూర ప్పలనాయుడు, అశోక్ కుమారు తదితరులు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ తమ కళాశాలలో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యాబోధన జరుగుతోందన్నారు.

క్యారెమ్స్ పోటీలు

డెంకాడ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం క్యారమ్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ వై.మహేష్ మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. క్యారెమ్స్ పోటీలో పతివాడ దిలీప్, కోరాడ మహీధర్ విజేతలుగా నిలిచారు.

తగ్గిన మామిడి దిగుబడి

- నష్టాల్లో మామిడి రైతాంగం
- అనుకూలించని వాతావరణం
- పంటను దెబ్బతీసిన చీడపీడలు
- జిల్లాలో 30,719 హెక్టార్లలో మామిడి సాగు
- 1,500 నుంచి 150 టన్నులకు పడిపోయిన ఎగుమతులు



వేపాడలో కాపులేని మామిడి తోట

ఎస్.కోట నియోజకవర్గంలో మామిడి తోటల సాగు విస్తీర్ణం వివరాలు

మండలం	విస్తీర్ణం (హెక్టార్లలో)
వేపాడ	422
లక్కవరపుకోట	922
కొత్తవలస	1,495
శృంగవరపుకోట	251
జామి	1,336

శృంగవరపుకోట: జిల్లాలో మామిడి సాగు చేసే రైతుల ఆశలు అడియాసలయ్యాయి. ఈ ఏడాది లాభాల మాట పక్కన పెడితే పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అను కూలించని వాతావరణం, పంటను ఆశించిన చీడపీడలు, అకాల వర్షాలు మామిడి రైతాంగాన్ని ఉసూరు మనిపించాయి. దేశీయ అవసరాలతో పాటు, విదేశాలకు ఎగుమతికి అవకాశం ఉన్న పంటగా మామిడికి మంచి స్థానం ఉంది. ఏటా కచ్చితమైన ఆదాయం అందుతుందన్న ధీమాతో నీటి అవకాశం లేని మెట్ట భూముల్లో రైతులు మామిడి తోటల పెంపకం కొనసాగిస్తూ వస్తున్నారు. మారిన పరిస్థితుల్లో ప్రభుత్వం ఉద్యానతోటల పెంపకానికి ప్రోత్సాహకాలు, రాయితీలు ఇవ్వడంతో వాణిజ్యపంటగా మామిడిని రైతులు ఎంచుకుంటున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రకాలను తెచ్చి తోటలపెంపకం చేపట్టారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచాలన్న లక్ష్యంతో గ్రాఫ్టింగ్ పద్ధతి ఎంచుకుంటున్నారు. కాగా పెట్టుబడి ఖర్చులు పెరగడం తప్ప ఆదాయం లేకపోవటంతో జిల్లాలో మామిడి సాగు క్రమంగా తగ్గుతోంది. ముదర మామిడి తోటలు తీసేసి వాటిస్థానే ప్రత్యామ్నాయ తోటల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలేనే మామిడి పంటను చీడపీడలు ఆశించా యి. తేనేమంచు పురుగు, పండుఈగ, కాయ తొలుచు పురుగులు పంటను దెబ్బతీశాయి. పూత దశలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో మొగ్గలు విచ్చుకోక, పూత ఆలస్యం కావడం,పిందె కట్టేందుకు ఎక్కువ సమయం తీసుకుంది. తర్వాత జనవరిలో కురిసిన అకాల వర్షాలు పంటకు ప్రతికూలంగా మారాయి. పూత, పిందె దశలో వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి.

నానాటికీ తీసికట్టుగా..

నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అన్న సామెత తీరుగా వరుసగా మామిడి దిగుబడులు రైతులను కుంగదీస్తున్నాయి. గడిచిన నాలుగేళ్లలో మామిడి దిగుబడులు 20 నుంచి 25శాతం వరకే ఉన్నట్టు ఉద్యానవన శాఖ గణాంకాలే చెబుతున్నాయి. కాగా ఈ ఏడాది ఈ దిగుబడులు ఇంకా తగ్గాయి. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో 10శాతం, మరికొన్ని ప్రాంతాల్లో 15శాతం దిగుబడులు ఉన్నట్టు ఉద్యానవన శాఖాధికా రులు చెబుతున్నారు. గతంలో జిల్లా నుంచి 1,500 టన్నుల మామిడి పండ్లు ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. నేడు జిల్లా నుంచి 150 టన్నులు ఎగుమతి ఎంతో కష్టంగా ఉన్నట్టు జిల్లా మామిడి రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు దేముడు చెబుతున్నారు.



వేపాడలో ఒక్క కాయకూడా లేని లేత మామిడి చెట్టు

ముంచేసిన మామిడి

గతంలో రూ.లక్ష విలువ చేసే తోటకు రూ.10వేలు పెట్టుబడులు సరిపోయేవి. కాగా నేడు రూ.లక్ష విలువ చేసే తోటకు రూ.లక్ష పెట్టుబడి అవుతోంది. చీడపీడలు, తగ్గిన దిగుబడులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, మామిడిపై ఆధారపడ్డ రైతులు, వ్యాపారులను దివాళా తీయించేసింది. గతంలో తోటలపై అడ్వాన్సులు ఇచ్చేవారు. దిగుబడులు లేక, రైతులు పంట ఇవ్వకుంటే వ్యాపారులు లక్షల రూపాయ ల్లో నష్టాలు చూస్తున్నారు. ఉత్తరాదికి మామిడి ఎగుమతి చేసే మధ్యవర్తులు లక్షల్లో పెట్టుబడి పెట్టి, స్టాక్‌పాయింట్లు, ప్యాకింగ్, లేబర్, ట్రాన్స్‌పోర్టు అన్నీ సిద్ధం చేసుకున్నాక పంపేందుకు సరుకు లేక నష్టపో తున్నారు.

తోటలు తీసేస్తున్నారు..



ఇవే పరిస్థితులు కొనసాగితే మామిడి పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవడం ఖాయం. ఇప్పటికే నష్టాలు భరించలేక రైతులు తోటలు తీసేస్తున్నారు. ఉద్యానశాఖ తక్షణం మామిడి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి, క్షేత్రస్థాయి పరిస్థితులపై ప్రయోగాలు జరగాలి. రైతులకు సస్యరక్షణ చర్యలపై అధికారులు మరింత అవగాహన పెంచాలి. కొత్త రకాలు, పాత తోటల పునరుద్ధరణ, వాతావరణం తట్టుకునే చర్యలపై ఒక ప్లానింగ్ అవసరం. ఈ ఏడాది వాతావరణం భిన్నంగా ఉంది. ఒకే రోజులో తీవ్ర మైన ఎండ, రాత్రి వేళ చలి ఉండడంతో పంటను చీడపీడలు దెబ్బతీశాయి. – లగుడు దేముడు, జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు

వాతావరణ పరిస్థితులే కారణం



చీడపీడలు, వాతావరణంలో అకాల మార్పులు ఈ ఏడాది మామిడి పంటకు శాపంగా పరిణమించాయి. పూత, పిందె దశలో తీవ్రమైన ఎండ, మంచు పంటను దెబ్బతీశాయి. పురుగుకు వాతావరణం అనుకూలించడంతో తేనేమంచు, కాయతొలుచు, పండు ఈగ వంటివి ప్రారంభంలోనే కోలుకోలేకుండా దెబ్బతీశాయి. ఈ ఏడాది దిగుబడులు 15 శాతంకు మించలేదు. – పి.పద్మ, కొత్తవలస మండల ఉద్యానశాఖాధికారి.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



మృతుడు భార్య కృష్ణవేణికి చెక్ అందజేస్తున్న ఎస్ఎంఎస్ పరిశ్రమ యూనిట్ హెడ్ గోపి, కార్మికులు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం ఎస్ఎంఎస్ ఫెర్రోపరిశ్రమకు చెందిన అదే గ్రామ కార్మికుడు ఎస్.ఈశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పరిశ్రమలో ఆయనతో పాటు పనిచేస్తున్న మిగిలిన కార్మికులంతా తమ ఒకరోజు వేతనాన్ని రూ.70 వేలును మృతుడి కుటుంబానికి సహాయంగా అందించారు. సంబంధిత చెక్‌ను పరిశ్రమ యూనిట్‌హెడ్ వాకాడ గోపి చేతులు మీదుగా మృతుని భార్య కృష్ణవేణికి అందజేశారు. పరిశ్రమ ప్రోడక్షన్ కన్సల్టెంట్ మధుబాబు, డిపార్ట్‌మెంట్ హెడ్స్ ఉప్పు శ్రీనివాసరావు, పక్కి శ్రీనివాసరావు, భాస్కర్, సరిధి రాంబాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కథలు, ఇతిహాసాలు చదవాలి



విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న ఉపాధ్యాయుడు రామకృష్ణ

శృంగవరపుకోట: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే నీతి కథలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని స్థానిక శాఖా గ్రంథాలయం అధికారి శ్రీధర్ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో బుధవారం పలువురు చిన్నారులు, విద్యార్థులకు నీతి బోధ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అంబటి రామకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులతో నీతి కథల పుస్తకాలు చదివించి, కథల్లో నీతి ఏమిటి అన్న అంశాలను విద్యార్థులతో చెప్పించారు. కథల్లోని నీతి నిత్య జీవితంలో ఎలా ఉపకరిస్తుంది, కథలను ఎందుకు చదవాలో విద్యార్థులకు రామకృష్ణ వివరించారు.

వేపాడ లైబ్రేరియన్‌గా చంద్రశేఖర్



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

వేపాడ: స్థానిక శాఖాగ్రంథాలయం లైబ్రేరియన్‌గా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన లైబ్రే రియన్ స్వామినాయుడుకు జామి మండలానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరిం చిన అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ జూన్ 7వ తేదీ వరకు రోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు వేసవి శిక్షణ శిబిరం కొనసాగనుందని చెప్పారు. కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నామని, ఆసక్తి గల విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే శిబిరంలో క్విజ్, వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు.

చెరువు గట్టుకు హద్దుల నిర్ధారణ



చెరువుగట్టు హద్దులను నిర్ధారిస్తున్న రెవెన్యూ అధికారులు

వేపాడ: మండలంలోని వావిలపాడులో స్టోన్ క్రషర్ యజమాని గ్రామానికి చెందిన కుబిరెడ్డి చెరువు గట్టును చదును చేసి, రోడ్డు వేస్తుండడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల సర్వేయర్ అప్పలనాయుడు, ఆర్ఐ రామలక్ష్మి తదితరులు బుధవారం సర్వే చేసి చెరువు గట్టు హద్దులు నిర్ధారించారు. నివేదికను తహసీల్దార్‌కు నివేదించ నున్నట్లు సర్వేయర్ తెలిపారు. ఇరిగేషన్ ఏఈ హేమకుమార్, వీఆర్‌ఓ ప్రసాద్, వావిలపాడు సర్వేయర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటకు పండగ శోభ



ఎస్.కోటలో అమ్మవారి జంగిడికి మొక్కుతున్న భక్తులు

శృంగవరపుకోట: ఎస్.కోటలో గ్రామదేవత ధారగంగమ్మ పండగ బుధవారం ప్రారంభమైంది. ఈనెల 28వ తేదీన అనుపోత్సవం నిర్వహించనున్నారు. ఇప్పటికే అమ్మవారికి నిత్య పూజలు, మొక్కుబడులు చెల్లిస్తున్నారు. మూడు పూటలా గ్రామంలో ఉదయం వేళలో జంగిడి, మధ్యాహ్న వేళలో పాలఘ టం, రాత్రి వేళలో కూటి ఘటాలు తిరుగుతున్నాయి. సంప్రదాయ సేవకులు అమ్మవారికి నిత్య సేవలందిస్తున్నారు. మరో పక్క ఇళ్లకు పండగ శోభ వస్తోంది. ఇళ్లు శుభ్రం చేయడం, కడగడం, రంగులు వేయడం వంటి పనుల్లో కొందరు ఉన్నారు. పండగకు బంధువులు, స్నేహితులు, ఆడపిల్లలు–అల్లు ళ్లు రానుండడంతో కావాల్సిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే పండగ పిలుపుల కోసం కొందరు తమ బంధువుల గ్రామాలకు వెళ్లే పనిలో ఉన్నా రు. నిర్వాహకులు పండగలో ఎక్కడా ఎటువంటి లోటు రానీయకుండా చూసేందుకు, ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తంగా పండగకు కేవలం ఆరు రోజుల వ్యవధి ఉండడంతో అంతటా పండగ సందడి కనిపిస్తోంది.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రకాశరావు పట్నాయక్

గజపతినగరం: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి మండలంలో మూడు కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రకాశరావు పట్నాయక్ తెలిపారు. కళాశాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల,సాయిసిద్ధార్థ కళాశాల, శ్రీకృష్ణ విద్యాపీఠ్‌లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 238 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 369 మంది హాజరు కానున్నారని తెలిపారు. సాయిసిద్ధార్థ శ్రీకృష్ణ విద్యాపీఠ్ కేంద్రాల్లో 470 మంది ప్రథమ సంవత్సర విద్యార్థులే పరీక్షలు రాయనున్నారని చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

ఆదమరిస్తే అంతే..



పోరలి గ్రామ సమీపంలో తారురోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

దత్తిరాజేరు: పోరలి గ్రామంలోని క్వారీ సమీపంలో తారు రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహన చోదకులు ఇక్కడ ఏ మాత్రం ఏమర పాటుగా వాహనాలు నడిపినా గోతిలో పడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై గొయ్యిని పూడ్చి వేయాలని స్థానికులు,వాహన చోదకులు కోరుతున్నారు.

వివాదాల జోలికి పోవొద్దు



లక్కిడాం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

గంట్యాడ: ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు గ్రామాల్లో అదే ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రజలంతా సహకరించాలని, ఎలాంటి గొడవలకు దిగవద్దని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు ప్రజలకు సూచించారు. లక్కిడాం గ్రామస్తులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీల గెలుపోటములపై ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా పెద్దలు బాధ్యత తీసుకోవాలని అన్నారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి



పూజలు చేస్తున్న అర్చకుడు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలో కొలువుదీరిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల పంచామృత ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం నూతన వస్త్రాలు, పూలతో స్వామినిన అలంకరించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



వేణుగోపాల స్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన ఉపాలయంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకులు స్వామి సన్నిధిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాల స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపించి, స్వామి సన్నిధిలో సదస్యం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రామపుష్కరిణిలో చక్రతీర్థ స్నానం జరిపిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్, పవన్, రామగోపాల్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి నరేంద్రకుమార్

తెర్లాం: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని నెమలాం పశువైద్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో ఈ సీజన్‌లో ఎక్కువగా జబ్బవాపు వ్యాధి సోకుతుందని, దీని నివారణకు అవసరమైన టీకాలను పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వేస్తున్నామన్నారు. అలాగే గొర్రెలు, మేకల పెంపకందారులు వారి వద్ద ఉన్న జీవాలకు చిటుకు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు



మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

నెల్లిమర్ల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంఘ నెల్లిమర్ల తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘ శాఖా అధ్యక్షుడు పి. వీరన్నదొర అధ్యక్షతన జరిగిన సమావేశానికి రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగుల సమస్యలను జిల్లా కమిటీ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే ఆపరిష్కృతంగా మిగిలి ఉన్న సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉద్యోగులు ఐక్యంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోలగలమన్నారు. నెల్లిమర్ల తాలూకా కమిటీ అధ్యక్షుడు వీరన్నదొర మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పట్ల జిల్లా నాయకత్వం చురుగ్గా స్పందించడం అభినందనీయమన్నారు. నెల్లిమర్ల తాలూకా యూనిట్‌ను కార్యవర్గ సభ్యుల సహకారంతో మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమావేశానికి సంఘ ప్రతినిధులు కంది వెంకటరమణ, చింతల వెంకటేష్, టి. శివప్రసాద్, డాక్టర్ చక్రవర్తి, ఎం. మురళీ, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.